బీసీ రిజర్వేషన్ బిల్లు దేశానికే ఆదర్శం

కాచిగూడ: విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును రాష్ట్ర శాసనసభ ఆమోదించడం పట్ల అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గుంజ శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకొచ్చిన బీసీ రిజర్వేషన్ బిల్లు దేశానికే ఆదర్శమని అన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు బీసీ రిజర్వేషన్ బిల్లు ఒక నిదర్శనమని పేర్కొన్నారు. 'జనాభాలో బీసీలు ఎంత శాతమో.. అధికారంలో అంత భాగం' అనే కాంగ్రెస్ అగ్రనాయకులు రాహుల్‌గాంధీ ఆశయానికి అనుగుణంగా కులగణన చేపట్టిందన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లును తీసుకురావడాన్ని స్వాగతిస్తున్నట్లు ఆయన తెలిపారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ ప్రభుత్వం బీసీ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించడం వల్ల స్థానిక సంస్థలతో పాటు విద్య, ఉద్యోగాలలో బీసీలకు ఎంతో మేలు జరుగుతుందని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి శ్యామ్‌యాదవ్ అన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి ఎంతో సాహసంతో అసెంబ్లీలో 42శాతం రిజర్వేషన్‌ను కల్పిస్తూ తీర్మానం చేయడం అభినందనీయమని అన్నారు. దీనిని బీసీలంతా స్వాగతిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు రాములు ముదిరాజ్, పర్వతాలు, వంజరి శ్రీనివాస్, కె. ఉదయ్, జగన్ యాదవ్, అమరేందర్, వాసు యాదవ్, లక్ష్మణ్ వర్మం, రాజు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నంకు సన్మానం

కాచిగూడ: బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లు ఏకగ్రీంగా అసెంబ్లీలో ఆమోదం పొందడంతో తెలంగాణ బీసీ సంఘం హర్షం వ్యక్తం చేసింది. తెలంగాణ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మంగళవారం సంఘం ప్రతినిధులు కలిసి సన్మానించారు. బిల్లు ఆమోదం పొందేలా తన వంతు కృషి చేసిన మంత్రికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్, నేతలు టి.రాజ్‌కుమార్, వినయ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సుందరీకరణ పనుల పరిశీలన

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని చౌరస్తా, కుడళ్లను సుందరీకరించేందుకు పనులు వేగవంతంగా కొనసాగుతున్నయని కార్పొరేటర్ పావని అన్నారు. మంగళవారం అశోక్‌నగర్ సర్కిల్‌లో సుందరీకరణ పనులను ఇంజినీరింగ్ విభాగం ఏఈ అబ్దుల్ సలామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, సిబ్బందితో కలసి ఆమె పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీనాయకులు వినయ్‌కుమార్, నవీన్‌కుమార్ ముదిరాజ్, రత్న సాయిచంద్, శ్రీకాంత్, సత్తిరెడ్డి, ప్రకాష్‌యాదవ్, జ్ఞానేశ్వర్, సాయికుమార్, ఆనంద్‌రావు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సీఎంఆర్‌ఎఫ్

చిక్కడపల్లి: దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ సీఎంఆర్‌ఎఫ్ అందిస్తామని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం సాయంత్రం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.2,70,000 చెక్కులను ఐదుగురు లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రతి పేద కుటుంబం కార్పొరేట్ వైద్యం పొందేందుకు సీఎంఆర్‌ఎఫ్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ముఠా జైసింహ, వై.శ్రీనివాస్, మహ్మద్ అలీ, చాంద్‌పాషా, శంకర్‌గౌడ్, ముచ్చకుర్తి ప్రభాకర్, ప్రవీణ్, కళ్యాణ్, బాక్సర్ కృష్ణ పాల్గొన్నారు.

మైనర్‌పై అత్యాచారం.. వ్యక్తికి జీవిత ఖైదు

కవాడిగూడ: ఓ మైనర్‌ను బెదిరించి అత్యాచారానికి పాల్పడిన ఓ వ్యక్తికి నాంపల్లి కోర్టు అదనపు జడ్జి జీవిత ఖైదు విధించారు. దోమలగూడ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం... ఆగస్టు 29వ తేదీ 2023న దోమలగూడలో అమర్ నేపాలి (37) ఓ బాలికను చాకుతో బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న తల్లిదండ్రులు దోమలగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సరైన ఆధారాలను కోర్టుకు సమర్పించారు. ఆధారాలను పరిశీలించిన జడ్జి నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.10వేల జరిమానా విధించారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

కవాడిగూడ: అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన దోమలగూడ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సుమారు 50ఏళ్ల ఓ వ్యక్తి సోమవారం మధ్యాహ్నం నుంచి ఎల్‌ఐసీకాలనీ సమీపంలో తచ్చాడుతూ కనిపించాడని స్థానికులు చెప్పారన్నారు. మంగళవారం ఉదయం చూసే సరికి ఎల్‌ఐసీ కార్యాలయం ఫుట్‌పాత్‌పై చనిపోయి ఉన్నట్లు స్థానికులు చెప్పారని తెలిపారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీ మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఫోన్ నం.87126 61521కు సమాచారం అందించాలని కోరారు.

సీఎండీ పనులు వేగవంతం

- ఫీవర్ చౌరస్తా నుంచి సాగుతున్న పనులు
- ఎమ్మెల్యే కాలేరు చొరవతో వడివడిగా సాగుతున్న పనులు
- డివైడర్లపై మొక్కల కుండీలు ఏర్పాటు చేయాలని వినతి

నల్లకుంట: అంబర్‌పేట నుంచి వచ్చే వాహనదారులు ఫీవర్ ఆస్పత్రికి వచ్చే రోగులతో పాటు శంకరమఠం, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, చిక్కడపల్లి వైపు వెళ్లాలంటే నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి సిగ్నల్స్ వద్ద లెఫ్ట్ టర్న్ తీసుకుని రత్నానగర్ అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద యూ టర్న్ తీసుకుని రావాల్సి ఉంటుంది. కాస్త దూరం వెళ్లి యూ టర్న్ తీసుకునే ఓపికలేని కొందరు ద్విచక్ర వాహనదారులు అక్కడక్కడ ఎత్తు తక్కువగా ఉన్న డివైడర్లపై నుంచి అటు వైపు రోడ్డు దాటి ప్రయాణించే వారు. అలాగే పాదచారులు కూడా ఇష్టారాజ్యంగా రోడ్డు డివైడర్లు దాటి వెళ్తూ ఉండేవారు.

◆ ఈ క్రమంలో బర్కత్‌పుర వైపు నుంచి వచ్చే వాహనదారులకు డివైడర్లపై నుంచి వచ్చే వాహనాలు, పాదచారులు అడ్డు వచ్చే పలు సందర్భాలలో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురై గాయాల బారిన పడేవారు. ఈ క్రమంలో స్థానిక రత్నానగర్ వాసులు ఈ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే అధికారులతో సమావేశమై సెంట్రల్ మెరీడియన్ డివైడర్ల(సీఎండీ) ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆ తర్వాత ప్రతిపాదనల ఆధారంగా అందుకు అవసరమైన రూ.44.5లక్షల నిధులను మంజూరు చేయించారు.

జనవరి 31న పనులు శంకుస్థాపన..

◆ రూ. 44.5 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టనున్న సెంట్రల్ మెరీడియన్ డివైడర్ల (సీఎండీ) నిర్మాణ పనులకు జనవరి 31న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ శంకుస్థాపన చేశారు. ఇక్కడి చౌరస్తాలో నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. దీంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, పనులు చేసే కూలీలకు ఎలాంటి ప్రమాదం జరుగకుండా పనులను కొనసాగించాలని ఎమ్మెల్యే జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో శంకుస్థాపన చేసిన నాలుగైదు రోజుల తర్వాత పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ యుద్ధ ప్రాతిపదికన నిర్మాణ పనులు చేస్తున్నారు.

◆ ప్రస్తుతం ఫీవర్ చౌరస్తా నుంచి రత్నానగర్ పెట్రోల్ పంపు వరకు పనులు పూర్తయ్యాయి. మరో వారం రోజుల్లో డివైడర్ నిర్మాణ పనులు పూర్తయిన వెంటనే డివైడర్లపై గ్రిల్స్ ఏర్పాటు చేయించనున్నారు. ఇప్పటి వరకు పూర్తయిన పనులకు నిత్యం వాటర్ క్యూరింగ్ చేస్తున్నారు. సెంట్రల్ మెరీడియన్ డివైడర్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే ఇక ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉండదని స్థానికులు చెబుతున్నారు.

ఫీవర్ చౌరస్తా నుంచి రత్నానగర్ వైపు వెళ్లే దారిలో పూర్తయిన సీఎండీ పనులు


ట్రాఫిక్ సమస్యలు తగ్గాయి



సెంట్రల్ మెరీడియన్ నిర్మాణంతో ఎక్కడ కూడా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వాహనదారులు సాఫీగా వెళ్లిపోతున్నారు. తిలక్‌నగర్ చౌరస్తా నుంచి ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా వరకు, ఫీవర్ చౌరస్తా నుంచి శంకరమఠం వరకు కూడా ఇలాంటి డివైడర్ల నిర్మాణం చేపడితే బాగుంటుంది.
– ఈశ్వర్, రత్నానగర్ బస్తీ మాజీ అధ్యక్షుడు


జనవరి 31న సెంట్రల్ మెరీడియన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ (ఫైల్)


రత్నానగర్ ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా కొనసాగుతున్న సీఎండీ పనులు

ప్రమాదాలు తగ్గాయి



ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ చొరవతో సెంట్రల్ మెరీడియన్ నిర్మాణం పనులు సాగుతున్నాయి. డివైడర్ నిర్మాణంతో ప్రమాదాలు తగ్గాయి. వాహనదారులు ఇష్టారీతిన డివైడర్లపై నుంచి వెళ్లి ప్రమాదాల బారిన పడకుండా ఉంది. డివైడర్ల పైన గ్రిల్స్ ఏర్పాటు చేసిన తర్వాత అక్కడక్కడ పచ్చని మొక్కల కుండీలు ఏర్పాటు చేయించాలి. అలా చేస్తే ఈ రహదారి ఎంతో అందంగా కనిపిస్తుంది. అలాగే వాతావరణ కాలుష్య నియంత్రణకు దోహదపడుతుంది.
– ఎంటీ. కిశోర్‌కుమార్, రత్నానగర్ బస్తీ అధ్యక్షుడు

'ఎస్సీ వర్గీకరణ' ఎమ్మార్పీఎస్ ఉద్యమ విజయం

ముషీరాబాద్: దండోరా ఉద్యమాన్ని మూడు దశాబ్దాలుగా సజీవంగా ఉంచింది ఎమ్మార్పీఎస్ ఉద్యమకారులేనని అందుకే ఈ విజయం ఎమ్మార్పీఎస్ ఉద్యమ విజయంగా భావిస్తున్నామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ అన్నారు. విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదింపజేసినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమకారుల రక్తం చిందించకుండా లాఠీ దెబ్బలు తినకుండా జైలుకు పోకుండా, అరెస్టులు కాకుండా ఉన్నట్లయితే ఈ రోజు ఎమ్మార్పీఎస్ వర్గీకరణ సాధించకపోయేదని అన్నారు. అప్పుడు అమరవీరులు పొన్నాల సురేందర్‌మాదిగ, దామోదర్‌మాదిగ, మహేష్‌మాదిగ, భారతి అక్క లాంటి వాళ్లు బతికుండేవారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లూరి వెంకట్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వరిగడ్డి చందు, హైదరాబాద్ జిల్లా నాయకురాలు రాధ, ఓయూ అధ్యక్షుడు ఎల్.నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ

22,23న 'రూపసజ్జ రూపాలంకరణ' వర్క్‌షాప్


వర్క్‌షాప్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సుధామాల, విజయకుమార్, జి.వసంధర


చిక్కడపల్లి: ప్రముఖ సాంస్కృతిక సంస్థ నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో ఈ నెల 22, 23వ తేదీలలో సుల్తాన్‌బజార్‌లోని రూపసజ్జ రూపాలంకరణ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్ తెలిపారు. చిక్కడపల్లిలోని సమితి కార్యాలయంలో ఈ వర్క్‌షాప్ ఉప సంచాలకురాలు జి.వసంధర, ప్రముఖ నృత్య గురువు డాక్టర్ సుమిత్ర వేలూరి మంగళవారం సమితి సభ్యులతో కలసి వర్క్‌షాప్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షురాలు వేమరాజు విజయకుమార్ మాట్లాడుతూ.. నృత్య కళాకారులు, నృత్య గురువులకు అతి ముఖ్యమైన రూపాలంకరణ, కేశాలంకరణలో నిష్టాతులైన బొమ్మా సుదర్శన్ ఈ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తారని తెలిపారు. అలంకరణలోని పద్ధతులను, మెళకువలను నేర్పుతారని సుధామాల తెలియజేశారు. ఈ సందర్భంగా వసుంధర మాట్లాడుతూ... నవ్యనాటక సమితి నృత్య సంగీత కళాకారులకు ఉపయోగపడే విధంగా అనేక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు.

ఏవీ కాలేజీని ప్రైవేట్ పరం చేసే కుట్రలను నిలిపేయాలి

కవాడిగూడ: ఏవీ కళాశాల యాజమాన్యం తమ రాజకీయ పలుకుబడితో కళాశాలలను ప్రైవేట్ పరం చేసే కుట్రలను చేస్తోందని ఏవీ కళాశాల విద్యార్థులు ఆరోపించారు. ఇలా చేస్తే పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ మేరకు కళాశాల విద్యార్థులు మంగళవారం హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ చైర్మన్ వి.బాలకృష్ణారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకుడు కార్తీ యాదవ్ మాట్లాడుతూ... ఎయిడెడ్ కోర్సులతో ఆర్థిక ఇబ్బందులు వస్తున్నాయని తప్పుడు ఆధారాలు చూపించి సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులుగా మార్చి పేద విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.1500 నుంచి రూ.3వేల వరకు ఉన్న కాలేజీ ఫీజును ప్రతిఏటా రూ.5వేల నుంచి రూ.10వేల వరకు పెంచుతూ పేదలను విద్యకు దూరం చేస్తోందన్నారు. ఈ విషయంపై విద్యాశాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. 7.13 ఎకరాల భూమిని ఏవీ కళాశాల యాజమాన్యానికి ప్రభుత్వం 99 సంవత్సరాలకు లీజ్‌కు ఇచ్చారనే విషయం ఏవీ కళాశాల యాజమాన్యం మర్చిపోయినట్టు ఉందన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి యొక్క ఎయిడెడ్ కళాశాలను ప్రక్షాళణ చేసి మెరుగుపరుస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏవీ కళాశాల విద్యార్థులు రేవంత్, విష్ణు, ఆకాంక్ష, విజయ్, శివ పాల్గొన్నారు.


హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ వి.బాలకృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కళాశాల విద్యార్థులు

స్థానిక సంస్థల ఎన్నికల్లో బ్రాహ్మణులకు రిజర్వేషన్లు కల్పించాలి


టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమను సన్మానిస్తున్న టీబీఎస్ఎస్ ప్రతినిధులు

నల్లకుంట: త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బ్రాహ్మణులకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి(టీబీఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొట నీలిమను మంగళవారం సాయంత్రం బీఏపీడబ్ల్యూఏ ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్‌తో కలిసి ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీబీఎస్ఎస్ కోశాధికారి మంత్రి సునిల్, ప్రతినిధి వి. ఉగ్రగిరి రావు తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిద్దాం


భగత్‌సింగ్ వర్ధంతి సభలో మాట్లాడుతున్న ఎండీ అబ్బాస్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిద్దామని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్ అన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎండీ అబ్బాస్ మాట్లాడుతూ... భగత్‌సింగ్ స్ఫూర్తిని విద్యార్థుల్లో నింపాలన్నారు. అందు కోసం విద్యార్థులను భగత్‌సింగ్ వేషధారణలో ఊరేగింపులు, ప్రదర్శనలు, ఏకపాత్ర అభినయాలు, నాటికలను ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. బాల్యదశ నుంచే విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్‌కే అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, గుమ్మడి రాజునరేష్, రాజయ్యగౌడ్, నాగేశ్వర్‌రావు, మహేష్ దుర్గే తదితరులు పాల్గొన్నారు.

దేశ భద్రతలో రక్షణ రంగ పరిశ్రమల పాత్ర కీలకం

కాచిగూడ: దేశ భద్రతలో రక్షణ రంగ పరిశ్రమలు కీలక పాత్ర పోషిస్తున్నాయని జాతీయ బీసీ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం వికాస భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్డినెన్స్ మాజీ ఉద్యోగులను ఆయన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది అందించిన సేవలను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ఆర్డినెన్స్ మాజీ ఉద్యోగులు మనోహర్ గౌడ్, బీష్మాచారి, మురళీధర్ తదితరులను శాలువాతో సత్కరించి అభినందించారు. యుద్ధ సామగ్రిని తయారు చేసి అందిస్తున్న ఉద్యోగుల సేవలు మరువలేనివని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాంగోపాల్ రెడ్డి, శ్రీనివాస్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సినీ రంగానికి చెందిన అర్హులకే ప్లాట్‌లు ఇవ్వాలి

చిత్రపురి హౌసింగ్ సొసైటీ కమిటీపై చార్జ్‌షీట్ దాఖలుపై హర్షం

కాచిగూడ: చిత్రపురి హౌసింగ్ సొసైటీ కమిటీపై 12 కేసుల్లో చార్జ్‌షీట్ దాఖలు చేయడంపై చిత్రపురి సాధన సమితి అధ్యక్షుడు కస్తూరి శ్రీనివాస్, ప్రజా నాట్య మండలి సినిమా విభాగం కార్యదర్శి మద్దినేని రమేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం హిమాయత్‌నగర్‌లో వారు మాట్లాడుతూ... చిత్రపురిలో దాదాపుగా రూ.300 కోట్ల భూముల కుంభకోణం, ప్లాట్ల కుంభకోణం, 449 సభ్యత్వాల టాంపరింగ్, 189 మార్ఫింగ్ అలాట్‌మెంట్స్, ఫొటోలు లేని 220 మంది సభ్యులు, 336 అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగినట్లుగా ప్రభుత్వం ధ్రువీకరించిందని తెలిపారు. ఆర్థిక నేరాల విభాగానికి చెందిన సైబరాబాద్ పోలీసులు ఇప్పటికే 12 చార్జ్‌షీట్‌లు, ఎల్‌బీనగర్ కోర్టులో నమోదు చేసి చిత్రపురి హౌసింగ్ సొసైటీ కమిటీపై 12 కేసుల్లో చార్జ్‌షీట్ దాఖలు చేశారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి సొసైటీ వల్లభనేని అనిల్‌కుమార్‌పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సినీ రంగానికి చెందిన అర్హులకే ప్లాట్‌లు ఇవ్వాలని కోరారు.

'ఈ ట్రస్ట్'ను రిజిస్ట్రేషన్ చేయొద్దు

చిక్కడపల్లి: ది ఇండిజీనియస్ చర్చెస్ ఇన్ ఇండియా ట్రస్ట్‌ను రిజిస్ట్రేషన్ చేయొద్దని హెబ్రోను ఇవాంజలిస్ట్ ఎం.రూబెన్ ఫ్రాన్సిస్, శ్యాంసన్‌లు వేర్వేరుగా అశోక్‌నగర్‌లోని చిక్కడపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు మంగళవారం తెలిపారు. ఇటీవల మృతిచెందిన బ్రదర్ ఎఫ్‌సీఎస్ పీటర్, బ్రదర్ థియోడర్ రెజినాల్డ్‌లను 2018లో ట్రస్టు నుంచి తొలగించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎఫ్‌సీఎస్ పీటర్ వేసిన పిటిషన్ పెండింగ్‌లో ఉందని ఆర్డర్ కాపీ రాకపోవడంతో వారు ఇద్దరూ ట్రస్టీలు కాదన్నారు. ట్రస్టు అమెండ్‌మెంట్‌ను ఆమోదించడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. కోర్టు ఆర్డర్ వచ్చే వరకు ఎలాంటి చర్యలు చేపట్టకుండా రిజిస్ట్రేషన్‌ను నిలిపివేయాలని కోరారు. ఎఫ్‌సీఎస్ పీటర్ మరణానంతరం కొందరు అధికారదాహంతో బోగస్ ట్రస్టు అమెండ్‌మెంట్ కోసం చిక్కడపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి రిజిస్ట్రేషన్‌నుకు యత్నిస్తున్నట్లు తెలిపారు. రాగి వీరాచారి, అద్దంకి ఇమ్మానుయేల్ హెబ్రోను స్వాధీనం చేసుకునేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించడం హర్షణీయం

- తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ
- అసెంబ్లీలో తీర్మానించి కేంద్రానికి పంపడంపై హర్షాతిరేకాలు


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి సన్మానిస్తున్న తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ ప్రతినిధులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: బీసీలకు 42శాతం రిజర్వేషన్లకై చట్టబద్ధత కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిన సందర్భంగా మంగళవారం తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగొని బాలరాజుగౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎలికట్టే విజయకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రత్యేకంగా శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. దేశ వ్యాప్త జనగణనలో కులగణన జరగాలని రాహుల్ గాంధీ నినాదం అని ఆయన ఆశయ సాధనకు అనుగుణంగా తెలంగాణలో కులగణన చేపట్టి 42శాతం స్థానిక సంస్థలతో పాటు ఉద్యోగ, ఉపాధిలో రిజర్వేషన్ అమలు చేస్తామని హామీ ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణలో లక్షలాది మందితో రాహుల్‌గాంధీకి కృతజ్ఞత సభను ఏర్పాటు చేయాలని బీసీ సంఘాలకు వారు పిలుపునిచ్చారు. పదేళ్లలో చేయలేని పనిని తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బీసీ బిల్లు సర్వే జరిపించడం అదృష్టంగా భావిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పడం గర్వకారణమని అన్నారు. ఇందిరాగాంధీ నుంచి రాహుల్ గాంధీ వరకు కాంగ్రెస్ పార్టీ బడుగు, బలహీనవర్గాల పక్షంగా నిలుస్తోందన్నారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో నాయకులు బాలగొని వెంకటేష్‌గౌడ్, సీనియర్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాసగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రూ.31వేల కోట్లు కేటాయించాలి

కాచిగూడ: కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు బడ్జెట్‌లో బీసీలకు రూ.31వేల కోట్లు కేటాయించాలని నేషనల్ ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ, ఆల్ ఇండియా తూర్పుకాపు సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు టి.శ్రీనివాసరావు నాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఎట్టి పరిస్థితులలో 27శాతానికి తగ్గకుండా బీసీలకు బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్యానికి బడ్జెట్ మేనిఫెస్టోలో ప్రతిపాదించినట్టు కేటాయింపులు చేయాలన్నారు. విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు పెంచిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి కృజ్ఞతలు తెలియజేశారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించేందుకు అన్ని పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వారు పిలుపునిచ్చారు.


మాట్లాడుతున్న నేషనల్ ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ

బీసీ బిల్లును వెంటనే రాష్ట్రపతి ఆమోదానికి పంపించాలి


మాట్లాడుతున్న టీజేఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నరసయ్య

ముషీరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రవేశపెట్టిన బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందడం పట్ల టీజేఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నరసయ్య, బీసీ జన సమితి అధ్యక్షుడు ఎస్.జస్వంత్‌కుమార్, ముషీరాబాద్ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్‌యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం అడిక్‌మెట్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. స్థానిక సంస్థలతో పాటు ఉద్యోగ నియమకాలలో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు సభ ఆమోదం పొందడం అభినందనీయమని అన్నారు. ఈ బిల్లును గవర్నర్ వెంటనే ఆమోదించి రాష్ట్రపతి ఆమోదం కోసం పంపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ బిల్లు ద్వారా బీసీలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించడానికి చిత్తశుద్ధితో ఉండాలన్నారు. ఈ సమావేశంలో టీజేఎస్ నాయకులు రవీందర్‌యాదవ్, అజయ్‌గౌడ్, హనుమంత్‌గౌడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన రిజర్వేషన్లు అమలు చేయొచ్చు..
రాజ్యాంగ సవరణ అక్కర్లేదు

నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ చైర్మన్ వీజీఆర్ నారగోని



కాచిగూడ: బీసీలకు తెలంగాణ ముఖ్యమంత్రి పదవి కేటాయించాలని నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ (ఎన్‌పీజేఎఫ్) చైర్మన్ వీజీఆర్ నారగోని మంగళవారం కాంగ్రెస్ అధిష్టానాన్ని డిమాండ్ చేశారు. కాచిగూడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... బీసీ ముఖ్యమంత్రి పదవి ఇచ్చే అవకాశం ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం తమ పరిధిలో లేని కేంద్ర రాజ్యాంగ సవరణ కోసం హడావిడి చేస్తోందన్నారు. బీసీల కోసం ఏదో చేస్తున్నట్లు నటిస్తూ బీసీలను మోసం చేస్తున్నారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం వెంటనే బీసీ బిల్లును ఆమోదించిన రోజు నుంచే పెంచిన బీసీ రిజర్వేషన్లు అమల్లోకి వచ్చినట్లుగా జీవోను జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టికల్ 16/4, 5/4 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు (ఎస్సీ, ఎస్టీ, బీసీ) వర్గాల కోసం రిజర్వేషన్లు పెంచుకోవచ్చని సుప్రీంకోర్టు కూడా ఇదే రకమైన తీర్పును ఇచ్చిందన్నారు. కాబట్టి తెలంగాణ ప్రభుత్వం పెంచిన రిజర్వేషన్లు అమలు చేయవచ్చని కేంద్రంలో రాజ్యాంగ సవరణ అక్కరలేదని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ చెప్పే సామాజిక న్యాయం అమలు చేయాలంటే బీసీలకు ముఖ్యమంత్రి పది కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నర్సయ్య, మీనగ గోపిబోయ, సి.వ రమేశ్వరి, జగదీశ్వర్‌యాదవ్, ఆర్.లక్ష్మణ్, లతాప్రభాకర్, టి.ధనలక్ష్మి, స్వప్న పాల్గొన్నారు.